# అపరిచిత ఆకాశం కింద

మహెజబీన్

(గతవారం తరువాయి)

**"ఏమే ఇలారా" పిలిచాడు ధనంజయ్.**

**చారుమతి అక్కడికొచ్చింది. "నీతో వీళ్ళు మాట్లాడాలట" చెప్పాడు.**

**"మీకు అమెరికా నచ్చిందా?" అడిగింది మధుబని.**

**"నచ్చడానికి ఇల్లు దాటి ఎక్కడికైనా వెళ్తేగా?"**

**"మీకు ఇక్కడ బాగుందా, మీ ఊరు బాగుందా?"**

**"నాకు మా ఊరే బాగుంది"**

**"మీ వారితో ఇక్కడ సుఖంగా ఉన్నారా?"**

**"లేను" అంది చారుమతి.**

**ధనంజయ్ తెల్లబోయి చూస్తున్నాడు చారుమతి వైపు. అతను ఊహించని జవాబులు చెప్పింది చారుమతి. సఖి వాళ్ళు చారుమతి స్టేట్‌మెంట్ రికార్డు చేసారు. ఆమె ఫోటోలు తీసుకున్నారు.**

అప్పుడు చెప్పింది మధుబని తను డొమెస్టిక్ వయొలెన్స్ విభాగం నుండి వచ్చినట్టు. "మీరు పోస్ట్ చేయకుండా చెత్తకుండీలో పడేసిన చారుమతి ఉత్తరం ఆధారంగా మా సంస్థలో మీమీద కంప్లయింట్ రిజిస్టర్ అయింది. మీరు చారుమతిని మాతో పంపాలి లేదా ఇండియా పంపే ఏర్పాట్లు చేయాలి వెంటనే. పరిస్థితి మా చెయ్యిదాటితే పోలీస్‌ని ఇన్వాల్వ్ చేయాల్సొస్తుంది. ఇండియాలో మీమీద ఫ్యామిలీ కోర్టులో హెరాస్‌మెంట్ కేస్ రిజిష్టర్ అవుతుంది. తర్వాత మీ ఇష్టం" కూల్‌గా చెప్పింది మధుబని.

అప్పుడు అర్థమైంది ధనంజయుకి వాళ్ళుఎవరో, తన మీద ఎంత బలమైన ఆధారాలతో వచ్చారో. చాలాసేపు నోట మాట రాక నిలబడిపోయాడు. తర్వాత గబగబా లాభనష్టాలు లెక్కవేసాడు. ఇండియాలో తెలిస్తే పెద్ద గొడవ అవుతుంది. పొలం,తోట, ఇల్లు అన్నీ పోగొట్టుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ పోలీసులకు తెలిస్తే ఉద్యోగానికి ప్రమాదం. అందుకని ఈ అమ్మాయిల్ని మానేజ్ చేయాలి అనుకున్నాడు.

"నా వల్ల తప్పైపోయింది. ఇక మీద చారుమతికి ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటాను" అన్నాడు ధనంజయ్. చారుమతి ఏడ్చేసింది మధుబని చేయి పట్టుకుని. "చారుమతి మా ప్రొటెక్షన్‌లో ఉంటుంది కొంతకాలం. ఈ పేపర్స్‌పై సైన్ చేయండి" అంటూ సఖి అగ్రిమెంట్ అతని చేతిలో పెట్టింది. "మీరు రోజూ సాయంత్రం మా కౌన్సెలింగ్ వింగ్‌కి రావాల్సి వుంటుంది" చెప్పింది మధుబని. ఒక చిన్న సూట్‌కేస్‌తో చారుమతి వాళ్ళతో బయలుదేరింది. స్వేచ్ఛా ప్రపంచంలోకి తొలి అడు గు వేసింది.

** ** **

"నేను, చారుమతి ఇంటికి వస్తున్నాం. చారుమతి మరీ పల్లెటూరి అమ్మాయి. తెలుగు తప్ప మరే భాషా రాదు. ఇక్కడ షెల్టర్ హోమ్‌కన్నా నాతోపాటు ఇంట్లో ఉంటే బాగుంటుందనుకుంటున్నాను. నీకేమైనా అభ్యంతరమా?" ఫోన్‌లో అడిగింది మధుబని.

"పిల్చుకురా" అన్నాడు ఇంద్రనీల్.

మధుబని, చారుమతి ఇంటికి వచ్చారు. "ఈ గది నువ్వు వాడుకో చారుమతి. నేను నీకు ఎదురుగా వుండే గదిలో వుంటాను. ఈ రెండు గదులు అనిరుధ్, ఇంద్రనీల్ వాడుకుంటారు. అన్నట్టు అనిరుధ్, ఇంద్రనీల్ మంచి ఫ్రెండ్స్. మేం అందరం ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉంటాం. స్నానం చేసిరా. టీ తాగుతూ మాట్లాడుకుందాం" అంది మధుబని.

"ఇంద్రనీల్, అనిరుధ్! ఏం చేస్తున్నారు రూమ్‌లో? వచ్చి టీ తాగండి. చల్లారిపోతోంది" పిలిచింది మధుబని.

ఇంద్రనీల్, అనిరుధ్ వచ్చేసారు. వస్తూనే, "వచ్చిందా చారుమతి?" అన్నారు.

"వస్తుంది, ఉండండి" అంది టీ అందిస్తూ.

అప్పుడే స్నానం చేసింది చారుమతి. అరవిరిసిన మల్లెపూవు లాగుంది. సురక్షితమైన చోట ఉన్నాను అన్న ఫీలింగ్ ఆమె ముఖంలో సంతోషాన్ని తెచ్చింది. మామూలు నేతచీర, కుంకుమబొట్టుతో తెలుగుదనం ఉట్టిపడుతూ, మెరుపుతీగలా కదిలి వచ్చింది.


"ఈ అమ్మాయి చారుమతి" పరిచయం చేసింది మధుబని.

"నమస్కారమండి" అంటూ చేతులు జోడించింది చారుమతి.

"ఈయన అనిరుధ్. నీ గురించి చాలా శ్రద్ధ తీసుకున్నారు" కృతజ్ఞతగా అనిరుధ్‌వైపు చూసింది చారుమతి.

చిరునవ్వుతో ఆమెను ఆహ్వానించారు వాళ్ళిద్దరూ.

"టీ తీసుకో" అంటూ కప్పు అందించింది మధుబని.



"కప్పుతో తాగడం రాదండి, గ్లాసులో పోసుకు తాగుతాను" అంటూ అంచువున్న స్టీలు గ్లాసు అందుకొని, అందులో టీ వంపుకుంది చారుమతి.

"మరిచిపోయాను, ఇండియా నుండి ఫ్రండ్స్ వస్తూ బొబ్బట్లు తెచ్చారుతిందాం" అంటూ ఓ ప్యాకెట్టు విప్పింది మధుబని. బొబ్బట్లను ప్లేటులో సర్ది డైనింగు టేబుల్ మీద సర్దింది. ఆ ప్యాకెట్టును చుట్టిన కాగితాన్ని ట్రాష్‌లో పడేసింది.

చారుమతి వెంటనే ఆ కాగితాన్ని అందుకొని, "తెలుగు పేపరు! ఎన్నాళ్ళకు చూసాను" అంది సంబరంగా.

"తెలుగు పుస్తకాలు చాలా వున్నాయి మా ఇంట్లో. చదువుదువులే" అంది మధుబని.

"వంట చేస్తూ మాట్లాడుకుందాం" అంటూ కూరగాయలు ఫ్రిజ్‌లో నుండి బయటికి తీసింది మధుబని.

"తరుగుతాను"అంటూ అవి అందుకొంది చారుమతి.

ఇంద్రనీల్ డిష్‌వాషర్ నుండి గిన్నెలు తీసి సర్దుతున్నాడు. అనిరుధ్ లాండ్రి చేస్తున్నాడు. మధుబని వంట చేస్తోంది. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నా, అందరి ఆలోచనలు చారుమతి గురించే.

"మీ అమెరికా నాకేమీ నచ్చలేదు" కూరగాయలు తరుగుతూ చెప్తోంది చారుమతి. "అందరూ ఇదేదో పెద్ద ఊరు అంటారుకదా, ఏంఊరో ఏమో, ఒక్కరికీ తెలుగు రాదు. చుట్టుపక్కల వాళ్ళు ఎవరూ మాట్లాడరు. మా ఆయన ఎక్కడో ఊరవతల ఇల్లు తీసుకున్నాడు. కనుచూపు మేరలో ఒక్క మనిషి కనిపించడు. మా ఇంటికి ఎవరూ రారు. ఈయన ఉదయం వెళ్ళి రాత్రికి ఇంటికి వస్తాడు. నాతో ఏమీ మాట్లాడడు. అలా ఏమీ మాట్లాడకుండా నెలలు గడిచిపోయాయి. మాటలు మర్చిపోతానేమోనని అద్దంలోచూస్తూ నాతో నేనే మాట్లాడేదాన్ని. గోడల్తో మాట్లాడేదాన్ని. మా ఆయన నన్ను ఎందుకు పెళ్ళి చేసుకున్నాడో అర్థమేకాదు. నాతో మాట్లాడడం ఇష్టంలేదు. నా వంట ఇష్టం వుండదు. నేనంటే ఇష్టం లేదు. నేను బాగాలేనా?" అడిగింది చారుమతి.

"నీకేం కుందనపుబొమ్మలా వున్నావు" అంది మధుబని.

కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ మళ్ళీ చెప్పసాగింది చారుమతి.

"మా ఊర్లో నా చేతుల్తో ఎంతమందికి అన్నం వండి పెట్టేదాన్ని! అలాంటిది చాలాసార్లు పస్తులున్నాను ఇక్కడ. ఈయన ఏమో బయట తినేసి వస్తాడు. ఇంట్లో వంట చేసుకోడానికి ఏమీ వుండవు. అడిగితే మర్చిపోయాను తేవడానికి అంటాడు. ఉదయం పాలల్లో మొక్కజొన్న పలుకుల్లాటివి వేసుకుని తిని వెళ్ళిపోతాడు. నాకేమో అది సయించదు. ఇడ్లీ, ఉప్మా, దోసలాంటివి చేసుకు తినాలని ఉంటుంది. నాకేం తెలుసు పెళ్ళైతే నాకిష్టమైన భోజనం కూడా చేయలేనని! రాత్రిపూట అదేంటో తింటాడు మా ఆయన- రెండు రొట్టెముక్కల మధ్య ఒక ఆకు, ఒక టమోటా ముక్క. నేను తిన్నానా లేదా ఏమీ పట్టించుకోడు"

"మరీ దుర్మార్గుడిలా వున్నాడు" అన్నాడు ఇంద్రనీల్ అందరికీ వినిపించేటట్టు.

"ఏంటో మా నాన్న! అమెరికా అల్లుడని మోజుపడి పెళ్ళిచేసాడు. నా పరిస్థితి తెలిస్తే ఏడుస్తాడు" చారుమతి చెప్తూచెప్తూ ఏడుస్తోంది. ఏడుస్తూ చెప్తోంది. సంఘటనలు గుర్తొచ్చినప్పుడల్లా కూరగాయలు కోయడం ఆపి చెప్తోంది. మళ్ళీ తలవంచుకుని కూరలు తరుగుతోంది.

చారుమతి మాటలకు వాళ్ళ కళ్ళు చెమ్మగిల్లాయి. అలా చెప్తూనే వుంది చారుమతి.

"మీ అమెరికాలో అడుగుపెట్టినప్పటి నుండి ఈరోజు చాలా తృప్తిగా భోజనం చేసాను. టమోటో పప్పు, బెండకాయ వేపుడు, రసం, కరివేపాకు పొడి అచ్చం మా ఊర్లో తిన్నట్టు వుంది" అంది చారుమతి.

"ఇవన్నీ ఇండియన్ స్టోర్స్‌లో దొరుకుతాయి. సాయంత్రం వెళ్ళి కొనుక్కుందాం. ఇంకా నీకు ఏమేం

కావాలో చెప్పు. ఇక్కడ ఇండియన్స్ చాలామంది వున్నారు. అలాగే తెలుగు మాట్లాడే వాళ్ళు ఉన్నారు. తెలుగు పుస్తకాలు వున్నాయి. మన ఊరి సినిమాలు ఉన్నాయి. ఒకమాటలో చెప్పాలంటే మన ఊర్లో ఉన్నట్టే ఉంటుంది. కొన్నాళ్ళ తర్వాత నీకు అలవాటై పోతే మన ఊరికన్నా బాగుంటుంది. కొన్ని రోజులు నువ్వు ఇక్కడ ఉండొచ్చు. తర్వాత నిన్ను ఇండియా పంపించే ఏర్పాట్లు చేస్తాను" అంది మధుబని.

అలాగే అంటూ తల ఊపింది చారుమతి.

** ** **

"చారుమతి నాకునచ్చిందిరా"అన్నాడు అరవింద్.

"చూడు, పెళ్ళిచూపుల కోసం కాదు ఆ అమ్మాయిని ఇక్కడికి తెచ్చింది" అన్నాడు ఇంద్రనీల్.

"నిజంగా చెప్తున్నానురా, చారుమతిలాంటి అమ్మాయి భార్య అయితే, ఇంకేం కావాలి. నా చెల్లెళ్ళు ఇలాగే ఉంటారు. వాడు ధనంజయ్ వట్టి రోగ్. ఆడపిల్లల విలువ తెలియదు. భార్య విలువ అంతకన్నా తెలీదు వాడికి. వాడు వది లేస్తే- ఐమీన్ డైవోర్స్- హాయిగా ఉంటుంది ఈ పిల్ల" అన్నాడు అనిరుధ్.

"మన ఇండియా సంగతి నీకు తెలీదా? విడాకులు తీసుకున్నాక ఆడపిల్లను మొగుడు వదిలేశాడు అంటూ చులకనగా చూస్తారు. మళ్ళీ పెళ్ళి చేయడం కూడా కష్టమే. కాని నువ్వన్నట్టు ఇలాంటివాడితో ఉండటం కంటే ఒంటరిగా బతకడమే మేలు" అన్నాడు ఇంద్రనీల్.

"అంతగా ఐతే నేను చేసుకుంటానులేరా" అన్నాడు అనిరుధ్.

** ** **

ఇండియన్ షాప్‌కెళ్ళి కావల్సినవన్ని కొంది మధుబని. ఆ షాప్‌లో వాళ్ళు అందరు ఇండియన్స్, అక్కడ కొనడానికి వచ్చినవాళ్ళు సగం మంది ఇండియన్స్. వాళ్ళను చూసి చాలా సంతోషపడిపోయింది చారుమతి. ఆ షాప్ అంతా తిరిగి చూసింది. చారుమతి ముఖంలో సంతోషం చూశాక హాయిగా ఊపిరి పీల్చుకుంది మధుబని. తెలుగు పాటల కేసెట్స్, డీవీడీలు, .కూరగాయలు అన్నీ కొంది మధుబని.

దారిలో వస్తూవస్తూ, "మా ఇంట్లో నువ్వు సంతోషంగా వుండు" అంది మధుబని. "అలాగేనండి. కాని ఒక్క విషయం. ఉదయం వరకు మీరెవరో నాకు తెలీదు. నాకు సహాయం చేయడానికి వచ్చారు. నేను కొన్ని రోజులు మీ ఇంట్లో ఉండాలికదా, మరి నేను మీకు భారం కానా?"

"ఏమీ కావు" అంది మధుబని.

"ఒక మాట చెప్తానండి" అంది చారుమతి.

"చెప్పు"

"నేనేమో రైతు కూతుర్ని. అందరికి పెట్టడం తప్ప ఇంకొకరి ఇంటికి వెళ్ళి తినడం అలవాటులేదు. ఊరికే మీ దగ్గర తిని కూర్చోవడమంటే బాగుండదు. నేను ఉన్నంతవరకు మీ ఇంటి పనులు చేసిపెడతాను. సరేనా?" అంది చారుమతి.

"అలాగే" అంది మధుబని. మనసులో ఆమె అభిమానానికి ముచ్చటపడుతూ.


"మేమందరం ఉదయాన్నే వెళ్ళిపోతాం. నువ్వు నాతో మా సఖి ఆఫీసుకు రా. కాని అక్కడ కూడా నీకు బోర్‌గా ఉంటుంది. నాకు తెలిసినవాళ్ళ ఇండియన్ రెస్టారెంట్ ఒకటి ఉంది. వాళ్లకు హిందీ, కొంచెం తెలుగు వచ్చు. అక్కడ అయితే నీకు టైం బాగా గడిచి పోతుంది. వచ్చేపోయే వాళ్ళతో రెస్టారెంట్ సందడిగా ఉంటుంది. నీ అంత అమ్మాయిలు చాలామంది ఉంటారు. నిన్ను ఉదయాన్నే అక్కడ దింపి నేను వర్క్‌కి వెళ్ళిపోతాను. మళ్ళీ సాయంత్రం నిన్ను తీసుకువెళ్తాను" అంది మధుబని.

"అలాగేనండి"

** ** **

రోజూ ఉదయాన్నే లేచి పనులన్నీ గబగబా ముగించుకుంటుంది చారుమతి.

చారుమతిని ఇండియన్



"మా ఆయన ఎక్కడో ఊరవతల ఇల్లు తీసుకున్నాడు. కనుచూపు మేరలో ఒక్క మనిషి కనిపించడు. మా ఇంటికి ఎవరూ రారు. ఈయన ఉదయం వెళ్ళి రాత్రికి ఇంటికి వస్తాడు. నాతో ఏమీ మాట్లాడడు. అలా ఏమీ మాట్లాడకుండా నెలలు గడిచిపోయాయి. మాటలు మర్చిపోతానేమోనని అద్దంలో చూస్తూ నాతో నేనే మాట్లాడేదాన్ని. గోడల్తో మాట్లాడేదాన్ని. మా ఆయన నన్ను ఎందుకు పెళ్ళి చేసుకున్నాడో అర్థమేకాదు. నాతో మాట్లాడడం ఇష్టంలేదు. నా వంట ఇష్టం వుండదు. నేనంటే ఇష్టంలేదు. నేను బాగాలేనా?" అడిగింది చారుమతి.

రెస్టారెంట్‌లో వదిలి తను ఆఫీసుకు వెళ్తుంది మధుబని.

రెస్టారెంట్ నుండి రోజూ సాయంత్రం సఖి ఆఫీసుకు వెళ్ళడం, అక్కడ కౌన్సెలింగ్ సెంటర్‌లో వాళ్ళు చెప్పే సలహాలు వినడం, తిరిగి మధుబనితో కలిసి ఇంటికి రావడం, రాత్రికి వంట చేయడం చారుమతి చేసే పని. ఆమె మానసికంగా కొంత తేరుకుంది. వేళకు తిని సంతోషంగా ఉంది కాబట్టి కాస్త ఒళ్ళు చేసింది. మునుపటికన్నా అందంగా కనిపిస్తోంది. సఖి ఆఫీస్ వాళ్ళు ఇచ్చే కౌన్సెలింగ్ చారుమతి మీద బాగా పనిచేసింది. స్వతంత్రంగా ఎలా బతకాలో వాళ్ల నేర్పించారు.

ముందు కొన్ని రోజులు రెస్టారెంట్‌లో కబుర్లు చెప్తూ, వాళ్ళకు పనుల్లో సహాయం చేసింది చారుమతి. తర్వాత వంటలు తయారుచేయించడం, కొత్తవి తను చేసి చూపించండి, ఒక్కటేంటి అన్ని పనులు తను దగ్గరుండి చేసేది. రెస్టారెంట్ ఆవిడ చారుమతికి డబ్బులు ఇచ్చింది పనుల్లో సాయం చేసినందుకు. అది కాక టిప్స్ వచ్చేవి. వర్క్ పర్మిట్ ఉంటే ఇంకా ఎక్కువ డబ్బులు ఇవ్వగలనని చెప్పింది. చాలా సంతోషంగా వుంది చారుమతికి. తన తొలి సంపాదన చూసి మురిసిపోయింది.

నెలరోజుల్లో ఆ రెస్టారెంట్‌లో చాలా మార్పులు వచ్చాయి. చారుమతి లేకపోతే జరగని పరిస్థితి. చారుమతి కాస్త మిస్ చాల్స్ అయింది. థాంక్స్ తప్ప మరో పదం తెలీదు. అయినా మేనేజ్ చేస్తుంది. రెస్టారెంట్‌కు వచ్చిన అమెరికన్స్‌ని చిరునవ్వుతో నమస్కారం అంటూ వెళ్ళి రిసీవ్ చేసుకుంటుంది. కూర్చోండి అంటూ కుర్చీ చూపిస్తుంది. ఆ వచ్చినవాళ్ళు కూర్చుంటారు. ఎలాంటి సంకోచం లేకుండా మెనూకార్డ్ చూపించి ఏంకావాలి అంటూ తెలుగులో అడుగుతుంది. దగ్గరవుండి వడ్డిస్తుంది. ఆ రెస్టారెంట్ కొచ్చే వాళ్ళకు ఇదంతా చాలా బాగా నచ్చుతుంది. ఇండియన్ కల్చర్, ఇండియన్ బ్యూటీ అంటూ చారుమతి వైపు ఆరాధనగా చూస్తారు. చారుమతి చీర, గాజులు, కుంకుమబొట్టు, ముక్కుపుడక, వాలుజడ, అందులో అమెరికాలో పూచిన రంగు రంగుల పూలు. ఇవన్నీ ప్రత్యేక ఆకర్షణలు వాళ్ళకు. ముఖ్యంగా ఆమె తెలుగు మాటలు.

రెస్టారెంట్‌కు వెళ్ళడం కాస్త ఆలస్యమైతే చారుమతికి ఫోన్లు వచ్చేవి. చారుమతి జీవితం మారిపోయింది. ఇప్పుడు ఇండియా వెళ్తానని అనడంలేదు.

"వంట చేయడం తప్ప నాకేమీ చేతకాదు అనేవాడు మా ఆయన. ఆ వంటే ఈరోజు నా జీవితాన్ని మార్చేసింది. వంట చేసినందుకు రెస్టారెంట్‌లో డబ్బులు ఇస్తున్నారు. వడ్డించినందుకు టిప్స్ ఇస్తున్నారు. రుచిగా ఉందని మెచ్చుకుంటూ తిని థాంక్స్ చెప్పి వెళ్తున్నారు. మా ఆయన ఒక్కరోజైనా మెచ్చుకుంటూ తిన్నాడా?" అంది చారుమతి.

"చారుమతి ఫెమినిస్ట్ అయిపోయిందిరా. డొమెస్టిక్ లేబర్‌కు ఎకనామిక్స్ కలిపి చెప్తుంది" అన్నాడు ఇంద్రనీల్.

"నాకు బాగా నచ్చిందిరా చారుమతి" అన్నాడు అనిరుధ్.

"ఆశలు పెంచుకోకు. త్వరలో వెళ్ళిపోతుంది"

"నేను వెళ్ళనిస్తేగా? ధనంజయ్ చారుమతికి డైవోర్స్ ఇచ్చేస్తే నేను పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు అనిరుధ్.

అప్పుడే "అనిరుద్ధా!" అని పిలుస్తూ బయటికి వచ్చింది చారుమతి. "నీలయ్యా, నువ్వు కూడా వెళ్లలేదా ఆఫీసుకు?" అంది ఇంద్రనీల్ వైపు చూస్తూ.

"ఇప్పుడే బయలుదేరబోతున్నాం" అన్నాడు ఇంద్రనీల్ నవ్వుతూ.

"ఏమైనా పనుందా మాతో?" అన్నాడు అనిరుధ్.

"టైం ఉందా నీకు?" అడిగింది చారుమతి.

"ఖాళీగా ఉన్నాను చెప్పు"

"కుంకుడుకాయలు కొనుక్కురావాలి. పక్కసందు మలుపుకాడ దింపుతావా?"

"అలాగే"

హ్యాండ్‌బ్యాగ్ తెచ్చుకోవడానికి లోపలికి వెళ్ళింది చారుమతి.

"నాకేమో బిజీగా వున్నానన్నావు, చారుమతికేమో ఖాళీగా వున్నానన్నావ్. ఏంటి సంగతి?"

"పాపం ఆడపిల్లరా"

"కుంకుడుకాయలు, సందు మలుపు. భలే.దొరికింది చారుమతి నీకు"

"నాకు దొరకాల్సిన పిల్లేరా. పొరపాటున వాడికి భార్య అయింది"

"వాళ్ళింట్లో పాలేరును పిలిచినట్టు నన్ను నీలయ్య అని పిలుస్తుంది చూడు"

"అమెరికాలో మనల్ని అంత ప్రేమగా పిలిచేవాళ్ళు ఎవరున్నారు చెప్పు?"

"సరే, ఆ పిల్లను డ్రాప్‌చేసి మనం వర్క్ కెళ్దామా?"

"నువ్వు వర్క్ కెళ్ళు. నా సెక్రటరీకి చెప్పు కాస్త ఆలస్యంగా వస్తానని. ఈరోజు చారుమతితో పర్సనల్‌గా మాట్లాడాలి"

స్నేహితుని వైపు నవ్వుతూ చూసి వెళ్ళిపోయాడు ఇంద్రనీల్.

** ** **

"కార్లో కూర్చున్నావా ఎప్పుడైనా?" అడిగాడు అనిరుధ్.

"లేదు, జట్కా బండిలో కూర్చున్నాను మా ఊర్లో" అంది చారుమతి.

"కబుర్లు చెప్పు"

"మీ ఊర్లో ఆడవాళ్ళు తల్లో మల్లెపూలు పెట్టుకోరా?"

"నీ అంత జడ ఉంటేగా పూలు పెట్టుకోవడానికి?"

"మరేమో... అనిరుద్ధా, మీ ఊర్లో..." ఏదో చెప్పబోయింది చారుమతి.

"మీ ఊరు, మీ ఊరు అనకు మాటకు ముందు. నా ఊరు అమెరికా కాదు. ఉద్యోగం కోసం వచ్చాను ఇక్కడికి. ఏదో ఒకరోజు ఇండియా వెళ్ళిపోవాలికదా!" అన్నాడు.

"ఆс ఏదో చెప్పబోయావు ఇందాక"

"మీ ఊర్లో... సారీ, అమెరికాలో... మల్లె పూలు దొరకవా?"

"దొరకవనుకుంటాను. కావాలా?"

కావాలి అన్నట్టు తల ఊపింది చారుమతి.

వెంటనే సెల్‌ఫోన్‌లో ఇండియన్ ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి "నెక్స్ట్ వీక్ వస్తున్నారుకదా న్యూయార్క్‌కి, ఒక మల్లెపూల బాస్కెట్ కావాలి, మరిచిపోకుండా తీసుకురండి" అని చెప్పాడు.

"ఎంత మంచివాడివి అనిరుద్ధా నువ్వు! నా గురించి ఎంత పట్టించుకుంటావు! నన్ను పెళ్ళిచేసుకున్న మనిషి సరిగ్గా నీలాగే ఉండాలనుకున్నాను. కానీ దేవుడు నాకు అన్యాయం చేసాడు" అంది చారుమతి.

ఆ మాటలకు జవాబుగా చారుమతి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు అనిరుధ్.

"ఏం ఆలోచించావు నీ గురించి? ధనంజయ్ బాగా చూసుకుంటే అతని దగ్గరికి వెళ్ళిపోతావు లేదా మీ అమ్మానాన్న దగ్గరికి వెళ్లిపోతావు. ఏంచేస్తావు మీ ఊరు వెళ్ళి? మళ్ళీ పిడకలుచేసి, అన్నంవండి పాలేర్లకు పెట్టి, పాలు పితికి... ఇవే కదా నువ్వు చేసే పనులు?"

"మరి ఇంకేం చేయను?"

"ఇక్కడే ఉండు. నిన్ను పెళ్ళి చేసుకుంటాను"

"ధనంజయ్‌కన్నా ముందు నువ్వు మా నాన్నకు కనిపించి ఉంటే నీకిచ్చి చేసి ఉండేవాడు. మా నాన్నకు కావల్సింది అమెరికా అల్లుడు" అంది.

** ** **

ధనంజయ్ సఖి ఆఫీసులో బాగా లాబీ చేసాడు. చారుమతిని తనతో పంపమని పదేపదే ప్రాధేయపడ్డాడు. ఇండియాకి ఫోన్‌చేసి చారుమతి తల్లిదండ్రులని పొరపాటయింది క్షమించమని అడిగాడు. చారుమతి నాన్నగారు మధుబనికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పారు. ధనంజయ్‌లో మార్పు వచ్చింది కాబట్టి చారుమతిని ధనంజయ్‌తో పంపించడానికే నిర్ణయించింది సఖి సంస్థ.

చారుమతికి అనిరుధ్‌పట్ల ఇష్టం వున్నప్పటికి ఆ విషయం బయటికి చెప్పలేకపోయింది. ధనంజయ్ కొంచెం మెరుగ్గా ప్రవర్తిస్తేచాలు, అతనితో జీవితం గడిపేయాలనుకుంది. విడాకులంటే మాటలా? తల్లిదండ్రులకు ఎంత అప్రతిష్ట? పల్లెలో తన గురించి ఏమనుకుంటారు అనుకుంది. స్త్రీలు తరతరాలుగా ఆలోచించే పద్ధతిలోనే ఆలోచించింది. మరోసారి ఆహుతైపోవడానికే నిర్ణయించుకుంది.



**ధనంజయ్ కొంచెం మెరుగ్గా ప్రవర్తిస్తే చాలు, అతనితో జీవితం గడిపేయాలనుకుంది. విడాకులంటే మాటలా? తల్లిదండ్రులకు ఎంత అప్రతిష్ట? పల్లెలో తన గురించి ఏమనుకుంటారు అనుకుంది. స్త్రీలు తరతరాలుగా ఆలోచించే పద్ధతిలోనే ఆలోచించింది. మరోసారి ఆహుతైపోవడానికే నిర్ణయించుకుంది.**

ఆరోజు సఖి ఫర్ సౌత్ ఏసియా ఆఫీస్‌లో ఒక ఇండియన్ అమ్మాయిని డొమెస్టిక్ వయొలెన్స్ నుండి కాపాడినందుకు అందరూ పీటర్‌ను అభినందించారు. పీటర్‌కు చాలా సంతోషంగా వుంది. చారుమతి కట్టిన రాఖీ చూసి మురిసిపోతున్నాడు. అందరికి "నా ఇండియన్ సిస్టర్" అంటూ పరిచయం చేస్తున్నాడు. అనిరుధ్, ఇంద్రనీల్ ఉన్నారక్కడ.

ముభావంగా ఉన్న స్నేహితుడి భుజం మీద చెయ్యి వేసి "ఏరా అలా వున్నావు?" అన్నాడు ఇంద్రనీల్.

"రేపు చారుమతి వెళ్ళిపోతుంది; బహుశా తిరిగి రాకపోవచ్చు" అన్నాడు అనిరుధ్ దిగులుగా.

"ఒకసారి స్వేచ్ఛ రుచి చూసాక, ధనంజయ్ దగ్గర ఇమడలేదు. వచ్చేస్తుంది. లీగల్ ఫార్మాలిటీస్ అన్నీ అయ్యాక వెంటనే పెళ్ళి చేసుకో". "అలా జరుగుతుందంటావా" అంటూ సంతోషం ఆపుకోలేక ఇంద్రనీల్‌ని ఎత్తుకున్నాడు అనిరుధ్.

"ఒరేయ్ దించరా. మనల్ని గే అనుకుంటారు. అప్పుడు నాకు మధు వుండదు, నీకు చారుమతి వుండదు" అన్నాడు ఇంద్రనీల్.

"నేనంటే ఇష్టమే చారుమతికి. కాని ధైర్యం చేయలేకపోతోంది" అన్నాడు అనిరుధ్.

పార్టీ నుండి అందరూ ఇంటికి వచ్చేసారు. చారుమతి ఇంటికి రాగానే తనకు నీరసంగా ఉందని, తల తిరుగుతున్నట్టుందని చెప్పింది.

మధుబని తన డాక్టర్ ఫ్రెండ్‌ని పిలిచింది ఫోన్‌చేసి. డాక్టర్ చెకప్ చేసి చారుమతి ప్రెగ్నెంట్ అని చెప్పింది.

"మా ఆయన ఇన్ని మందు బిళ్ళలు తెచ్చి రోజూ ఒకటి మింగమన్నాడు, పిల్లలు పుట్టకుండా ఉంటారని. నేను బిళ్ళలు వేసుకుని ఎరగను. పడేసాను" అని మధుబనితో చెప్పింది చారుమతి.

"ఎంత దుర్మార్గుడైన మగవాడైనా భార్య కడుపుతో ఉందంటే సంతోషిస్తాడు. నా బిడ్డే నా భవిష్యత్తుకు ఆలంబన" అనుకుంది చారుమతి బట్టలు సర్దుకుంటూ.

"నెలరోజులు చాలా బాగా గడిచిపోయింది నీతో. అప్పుడప్పుడు మాకు ఫోన్‌చేయి. రెస్టారెంట్‌కువెళ్ళడం మానేయకు. లేకపోతే మళ్ళీ నీకు బోర్ అయిపోతుంది లైఫ్. మేమంతా నీతో ఉన్నాం" అన్నారు మధుబని, ఇంద్రనీల్.

అనిరుధ్ దగ్గరికి వెళ్ళింది చారుమతి, "నీకు నాకంటే మంచి అమ్మాయి, చదువుకున్న అమ్మాయి దొరుకుతుంది" అని చెప్పింది.

** ** **

ఏమీ మాట్లాడకుండా బరువెక్కిన మనసుతో కారు డ్రైవ్ చేస్తున్నాడు అనిరుధ్. పక్కన ఇంద్రనీల్, వెనక పీటర్ కూర్చున్నారు. వెనక ఇంకో కారులో చారుమతి, మధుబని, సఖి గ్రూప్‌తో కలిసి వస్తున్నారు.

కారు దిగి అందరికీ వీడ్కోలు చెప్పింది చారుమతి. మధుబనికి, సఖి వాళ్ళకు థాంక్స్ చెప్పి చారుమతిని బాగా చూసుకుంటానని వాగ్దానం చేసాడు ధనంజయ్.

అందరూ వెళ్ళిపోయారు చారుమతిని భర్త ధనంజయ్ దగ్గర దించి. ఇంట్లోకి అడుగుపెట్టింది చారుమతి.

చారుమతి ఇంటికి కొద్దిదూరంలో కార్లు ఆపి నిలబడ్డారు అందరు. ధనంజయ్‌ని ఎంతవరకు నమ్మవచ్చు అని ఆలోచిస్తున్నారు. సఖిగ్రూప్, మధుబని, పీటర్ ఒకచోట నిలబడి మాట్లాడుకుంటున్నారు. అనిరుధ్ స్టీరింగ్ ముందు తల ఆన్చి కళ్ళు మూసుకున్నాడు.

"అనిరుధ్, నువ్వేంటి ఇలా అయిపోయావు? నీ జీవితంలోకి చాలామంది ఆడపిల్లలు వచ్చారుకదా!" అన్నాడు ఇంద్రనీల్.

"పడకగది వరకు వచ్చారు, వెళ్ళిపోయారు. కాని చారుమతి పడకగదికి రాలేదు. జీవితంలోకి వచ్చింది. ఈనెల రోజుల్లో నాకు బాగా దగ్గరైంది. చాలా ప్రేమగా చూసుకుంది అమ్మలాగా. నాకు అమ్మలాంటి భార్య కావాలి. చారుమతి కావాలి" అన్నాడు అనిరుధ్.

"ఇంకొకరి భార్య కావాలంటే ఎలారా?"

"అదే, ఆ మాటే చెప్పొద్దంటున్నాను"

స్నేహితుడి బాధను అర్థం చేసుకుని మౌనంగా ఉండిపోయాడు ఇంద్రనీల్.

అదే సమయంలో ధనంజయ్ "ఏమే కడుపు తెచ్చుకుని నెలరోజుల తర్వాత ఇంటికి వస్తావా?" అంటూ చారుమతి జుట్టు పట్టుకుని కొడుతున్నాడు. పాత చారుమతి అయితే కాళ్ళు పట్టుకుని, కడుపులో ఉన్నది నీ బిడ్డే అంటూ దీనంగా వేడుకునేది. కాని ఇప్పటి చారుమతి వేరు. సూటిగా ధనంజయ్ వైపు ఒక్కచూపు చూసింది. సూట్‌కేస్ తీసుకుని బయటకువచ్చింది. ఆ ఇంటి నుండి, ధనంజయ్ జీవితం నుండి శాశ్వతంగా బయటికి వచ్చింది.

బరువెక్కిన మనసుతో వడివడిగా అడుగులు వేస్తూ రోడ్డుమీదికి వచ్చింది. కట్టలు తెంచుకున్న దుఃఖం. అపరిచితమైన రోడ్డు. వివాహబంధంకూడా అపరిచితంగానే ఉంటుంది ఎప్పటికి. ఏడడుగులు ఏమయ్యాయి ఇప్పుడు? ధనంజయ్ ఎంత అపహాస్యంచేసాడు పెళ్ళిని! అనిరుధ్ ఎంత బాధ్యతగా ప్రవర్తించాడు తనపట్ల! ఆలోచిస్తూ, ఏంచేయాలో తెలీక ఏడుస్తూ నడుస్తోంది చారుమతి.

ఏడుస్తూ వస్తున్న చారుమతిని కారు మిర్రర్ నుండి చూసాడు ఇంద్రనీల్. "అనిరుధ్, నీ చారుమతి వచ్చేసింది, మనం ఊహించనంత త్వరగా" అన్నాడు.

ఇద్దరూ కారు దిగి నిలబడ్డారు. పది నిముషాల వ్యవధిలో ఏడుస్తూ తిరిగి వస్తున్న చారుమతిని చూసి, షాక్‌కు గురయ్యారు సఖి గ్రూప్. వెంటనే ఎలర్ట్ అయి పోలీసుకు ఇన్‌ఫర్మేషన్ పంపారు.

"అనిరుద్ధా!" అంటూ ఏడుస్తూ వచ్చి చుట్టుకుపోయింది. చారుమతి, భుజాల చుట్టూ చేతులు వేసి "ఇప్పుడు నన్ను చారుమతిని ఎవరూ విడదీయలేరు" అనుకున్నాడు అనిరుధ్.

వెనకే ధనంజయ్ పరుగెత్తుకు వస్తున్నాడు. వీళ్ళంతా వుంటారని ఊహించలేదు.

ధనంజయ్‌ని చూసి అనిరుధ్ చారుమతిని ఇంకాస్త దగ్గరికి లాక్కున్నాడు. ఆ దృశ్యం చూసి ధనంజయ్ మండిపడ్డాడు.

"నువ్వేనా దీని ప్రియుడివి? అయినా నేను దీనికోసం రాలేదు. మెడలో ఉన్న పది తులాల మంగళసూత్రాల కోసం వచ్చాను" అన్నాడు.

ఆ మాటలకు గాయపడి చివ్వున తల ఎత్తింది చారుమతి. ధనంజయ్ వైపు నిరసనగా ఒక్క చూపు చూసింది. మెడలో చెయ్యి వేసి మంగళసూత్రాలు పట్టి బయటికి లాగింది. అంతే, మరుక్షణం మంగళసూత్రాలు తీసి, ధనంజయ్ వైపు విసిరికొట్టింది చారుమతి.

అపరిచిత ఆకాశం కింద కొత్త పరిచయాల నీడలో సరికొత్త జీవితాన్ని వెతుక్కుంటూ ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్ళిపోయింది చారుమతి.